# మనసుకు మరణశిక్ష

డా. కర్రా సోమశేఖరం




**మ**నసు గతి ఇంతే...మనిషి బ్రతుకింతే
మనసున్న మనిషికి సుఖములేదంతే...

దూరదర్శన్ చిత్రలహరిలో శ్రావ్యంగా ఆపాట వినిపిస్తూంటే చెమర్చిన కళ్లు తుడుచుకుంటూ వీధి వరండాలోకి వెళ్లిపోయాడు ప్రకాశం.

అదో వృద్ధాశ్రమం. హైద్రాబాద్ నగరశివార్లో షంషాబాద్ దగ్గర ఉంది. అది ఏ సంస్థ చేతా నడవబడటంలేదు. వదిహేను మంది వృద్ధులు కలిపి అయిదువందల గజాల్లో ఆరుగదులతో నిర్మించుకున్నారు. విశాలమైన గదులు గదికి ముగ్గురుండవచ్చు. ఒక గది వంట భోజనాలకు. కాలుష్యానికి దూరంగా ప్రకృతికి దగ్గరగా ప్రశాంతవాతావరణంలో నిర్మింపబడ్డ ఆ ఆశ్రమ పరిసరాలు ఎంతో ఆహ్లాదంగా ఉన్నాయి.

అందరిలోకి కాస్త ఆరోగ్యం, చలాకీగా వున్నవాడు ప్రకాశం. వయసు అరవై. ఆ ఆశ్రమానికి ఓ అరలక్ష విరాళమిచ్చి తన శేషజీవితాన్ని ప్రశాంతంగా గడుపుకోవాలని అక్కడ చేరాడు. ప్రశాంతత తెచ్చుకునేది కాదుగా. మానసికంగా మనసులోంచి కలగాలి. అది ప్రస్ఫుటంగా ముఖంలో కనుపిస్తూనే వుంటుంది. ఆ ఆశ్రమంలో వున్న అందరికీ తలోకథ తలో బాధ.

చాలామంది ఏదో అనారోగ్యంతో పిల్లలకు బరువై, వాళ్ల చేతలు మాటలు పడలేక, సేవలు కరువై ఆశ్రమంలో చేరారు.

కాలు చెయ్యి ఆడుతోంది కాబట్టి వున్న ఓపికతో సిటీకివెళ్లి మిత్రులందరిని కలవటం, వచ్చేటప్పుడు తన వృద్ధ మిత్రులందరికి పళ్లు, బిస్కెట్లు, ఎమర్జెన్సీ మందులు వగైరా తెచ్చివ్వటం పరిపాటయిపోయింది ప్రకాశానికి. ఈ దైనందిన కార్యక్రమంకోసం బస్సుపాసు కొనుక్కున్నాడు. సిటీకి వెళ్లివచ్చిన ప్రకాశం అందరికి అన్నీ ఆప్యాయంగా వంచి ఇవ్వటం తనకోసం తెచ్చుకున్నవి అల్మారాలో భద్రపరుచుకుని గ్లాసుడు నీళ్లు గడగడ త్రాగి ఈజీ ఛైరులో మేను వాల్చటం...ఏదో దిగులు అశాంతి వెంటనే అతని మొహంలో చోటు చేసుకోవటం గమనిస్తూనే వున్నారు వృద్ధమిత్రులు.

ఎన్నోసార్లు అలా గమనించిన మిత్రులంతా వరివరివిధాలుగా ప్రశ్నించారు ప్రకాశాన్ని అతని అశాంతికి కారణమేమిటని.

తన గతాన్ని అతని చేదు అనుభవాలను వివరించసాగాడు.

000

వివాహం, సంసారయాత్ర ఇద్దరు ఆడ పిల్లలు కలగటం చకచక జరిగిపోయింది. ముద్దు ముద్దు మాటలతో, ఆటలతో పిల్లలు పెద్దవాళ్లవుతున్నారు. తన కొచ్చే జీతంతో సునాయాసంగానే నెట్టుకొస్తున్నాడు సంసారాన్ని. కాకపోతే అయ్యో...పాపం అనే జాలి గుణంతో అడిగిన వాడికల్లా అప్పు ఇవ్వటం, దాన్ని రాబట్టుకోవటానికి వాళ్లచుట్టూ తిరగటం అతని భార్యకు నచ్చలేదు.

"ఎందుకొచ్చిన బాదరబందీ ఆ డబ్బు మన పిల్లలపేర దాస్తే వాళ్ల భవిష్యత్తుకు వనికివస్తుందిగా. అప్పులిచ్చి వాళ్ల చుట్టూ తిరగటం ఏంబాగుంది?"

భార్యామణి మాటలు చెవికెక్కలేదు.

ప్రకాశం మేనమామ కొడుకు చిన్నగా అప్పడాల వ్యాపారం చేసుకుంటున్నాడు. పెళ్లిళ్ల సీజనులో భారీగా ఆర్డర్లు వచ్చి వడడంతో అయిదువేలు అప్పుతీసుకున్నాడు ప్రకాశం దగ్గర. అప్పడాలు చెయ్యటం, సప్లయి చెయ్యటం వాళ్ల దగ్గర డబ్బు తీసుకోవడం కూడా జరిగిపోయింది. తన వబ్బుం గడుపుకున్నాడు లాభం ఆర్జించాడు. ప్రకాశం అప్పు నెమ్మదిగా ఇవ్వచ్చులే అని మొఖం చాటేసుకు తిరుగుతున్నాడు.

అలాగే ప్రకాశం ఆఫీసు స్నేహితుడొకరు తండ్రికి కాన్సర్ అని అర్జంటు పరీక్షల కోసం వదివేలు తప్పక సర్దమని ప్రాధేయపడటంతో భార్యకు తెలియకుండా అంత పెద్ద మొత్తం ఇయ్యడం, ఏడాది తిరిగినా ఆ డబ్బు రాలేదు.

ఇలా...చిన్నా చితకా ఏభై వేలదాకా అందరి చేతుల్లోనూ తిరుగుతోంది. ఏళ్లు గడిచాయి. అప్పుగా ఇచ్చిన ఆ సొమ్ము తిరిగి రాలేదు. అయ్యో... పాపం ఇవాళో రేపో ఇచ్చేస్తారులే అనే మంచి తనాన్ని ఆసరాగా తీసుకుని అప్పు

తీసుకున్నవాళ్లంతా మొహం చాటేసుకుని తిరగటం, తప్పనిసరి పరిస్థితుల్లో ప్రకాశం ఎదురుపడి గట్టిగా అడిగితే వేలు తీసుకున్న వాళ్లు వందలు చేతిలో పెట్టి చిలక్కొట్టుడు వ్యవహారం ప్రదర్శించి వెళ్లిపోవటం పరిపాటయిపోయింది.

ఈ వ్యవహారంతోనే భార్యాభర్తలమధ్య చిన్న చిన్న గొడవలు ప్రారంభమయి చిలికి చిలికి గాలివానగా తయారయింది. ప్రకాశం మంచితనాన్ని, అయ్యో...పాపం అనే జాలి గుణాన్ని చేతకాని తనంగా భావించి ఓ దద్దమ్మగా జమకట్టి నిష్ఠూరంగా మాట్లాడింది భార్య


"మీరేమైనా దానధర్మాలు చేసుకోండి. నాకు నా పిల్లలకు ఎంతో కొంత డబ్బు ఇస్తే మామానాన్న మేం బ్రతుకుతాం. మీరు వేరే గది తీసుకుని మీ వ్యవహారాలు మీరు దర్జాగా గడుపుకోండి అడిగే వారెవ్వరూ వుండరు. మంచితనమో, చేతకానితనమో దాని పర్యవసానం నెమ్మది నెమ్మదిగా మీకే తెలిసొస్తుంది" అలా సాగిన వేడి సంభాషణతో సంసారబంధం తెగిపోయింది. ప్రకాశం వేరే రూము తీసుకుని వెళ్లిపోయాడు. ప్రతినెల వెయ్యిరూపాయలు మిత్రుల ద్వారా పంపుతున్నాడు.

ప్రకాశం ఇల్లు విడిచి వెళ్లిపోయిన తరువాత ఆ భార్యామణి ఓ చిన్న ఉద్యోగంలో చేరింది. ఇద్దరు ఆడపిల్లల ఆలనా పాలనా చూసుకుంటూ ఆ చిన్న కుటుంబాన్ని నెట్టుకొస్తోంది.

చూస్తూ చూస్తుండగానే పదేళ్లు గడిచిపోయాయి.

ఇద్దరు ఆడపిల్లలు ఓ వారం అటు ఇటూగా పెద్దమనుషులయ్యారు. 'రజస్వల' ఆడపిల్ల జీవితంలో ఓ గొప్ప మార్పు అదో గొప్ప ముచ్చట కూడా. ఆ విషయం తెలుసుకున్న ప్రకాశం తన దగ్గర దాచివుంచిన పదివేలు పిల్లలకు కొత్త బట్టలు ముద్దు ముచ్చట్ల ఖర్చు నిమిత్తం ఓ మిత్రుడి ద్వారా పంపించాడు.

ఆ డబ్బును అందుకున్న భార్యాపిల్లలు ఎంతో ఆనందం పడ్డారు. ప్రకాశం నైజం మారనందుకు మాత్రం బాధపడ్డారు. ప్రకాశం లేకుండానే ముద్దుముచ్చట్లు విందు వినోదాలు ముగిశాయి. పిల్లలిద్దరూ చీరలు కట్టుకుని తల్లితో తీయించుకున్న ఫొటోలు మాత్రం పోస్టులో అందాయి ప్రకాశానికి. తనివితీరా ఆ ఫొటోలను చూసుకున్నాడు. పలుమార్లు ముద్దుపెట్టుకున్నాడు. చిన్న చిన్న మాట పట్టింపులతో సంసారబంధాలు ఎలా తెగిపోయాయో అని ఎంతో బాధపడ్డాడు. కాకపోతే ఇద్దరి జీవితాలు స్వతంత్రంగా స్వేచ్ఛగా సాగిపోతున్నాయి. ఎవరికీ ఎవరూ అడ్డుకట్టలేరు. కోపతాపాలు లేవు. ఎవరికి వారే యమునాతీరే.




కాకపోతే ప్రకాశం రిటయిరయ్యాడు. ఒంటరి జీవితం అయిపోయింది. అప్పుడప్పుడు పిల్లలు వచ్చి చూస్తుండేవారు. భార్య ఏనాడూ రాలేదు. కొంతలో కొంత తృప్తి.

ఓరోజు ఇద్దరు ఆడపిల్లలూ వచ్చారు. కొత్త బట్టలు వేసుకున్నారు. తండ్రి కాళ్లకు దండం పెట్టి చేతిలో స్వీటు బాక్సు వుంచారు. "ఇవాళ అక్కయ్య పుట్టినరోజు" డాడీ అంది చిన్నమ్మాయి.

గబగబా లోపలకు వెళ్లి అలమార్లో భద్ర పరచిన రెండు చెక్కులు రెండు వందనోట్లు తీసుకువచ్చాడు ప్రకాశం.

"అమ్మా నేను రిటయిరయిపోయాను. ఈ లక్షరూపాయల చెక్కు, ఈ ఇరవైవేల చెక్కు అమ్మకియ్యండి. ఈ రెండు వందలు మీరిద్దరూ తీసుకోండి. లక్ష మీ పెళ్లిళ్ల ఖర్చుకోసం, ఇరవైవేలు నిత్యకృత్యం గడుపుకోటానికి. ఇటుపైన నేను నెలనెల సొమ్ము పంపలేనుగా. మీ పెళ్లిళ్లు కుదిరితే ఈ నాన్నకు శుభలేఖ పంపడం మరువకండి" ఇద్దరు పిల్లలని దగ్గరగా తీసుకుని భోరుమని ఏడ్చాడు ప్రకాశం.

ప్రకాశం పరిస్థితి చూసి పిల్లలిద్దరూ చలించిపోయారు. ఏం చేయగలరు? అమ్మానాన్నలను కలపనూలేరు. వాళ్లిద్దరి ఒంటరి బ్రతుకులు చూస్తూంటే గుండెబరువెక్కిపోతోంది. "మాట పట్టింపు మొండితనం వాళ్లిద్దరినీ ఈ స్థితికి తీసుకొచ్చాయి. ఎవ్వరు ఏం చేయులేరు" అని మనసులోనే సమాధానపడి తండ్రికి బై చెప్పి వెళ్లిపోయారు.

ఆ తర్వాత తన దగ్గర మిగిలిన సొమ్ములో అరలక్ష ఆశ్రమానికిచ్చి చేరటం అరలక్ష బ్యాంకులో వేసుకోవడం ప్రభుత్వం వారిచ్చే పెన్షన్ వడ్డీలో జీవితం గడుపుకోవటం సాఫీగానే సాగిపోయింది. కాకపోతే అప్పులిచ్చిన చిట్టాయే ప్రశ్నార్థకంగా మిగిలిపోయింది.

000

తన ఆవేదన, అశాంతికి కారణమైన గతాన్ని వివరించిన ప్రకాశం వృద్ధమిత్రులందరికేసి దీనంగా చూశాడు. వృద్ధ మిత్రులంతా జబ్బతట్టి

"నీ మంచితనమే నీకు శ్రీరామరక్ష. మాట పట్టింపులు సహజం. కాకపోతే తెగేదాకా సాగదీశారు. సంసారబంధం తెగిపోయింది. ఏం చేస్తాం విధి వైపరీత్యం. లేవండి భోంచేద్దాం" అందరూ భోజనాలకు బయలుదేరారు.

భోజనాలు ముగించి ఎవరి గదులకు వాళ్లు వెళ్లిపోయారు. ఆ రాత్రి భారంగా గడిచింది.

000

సూర్యోదయానికి పూర్వమే వుత్సాహంగా లేచి వాకింగ్, యోగాసనాలు పూర్తి చేసే ప్రకాశం ఇంకా నిద్ర లేవలేదు. మిత్రులందరికీ ఆశ్చర్యం కలిగించింది.

"రాత్రి పొద్దుపోయేదాకా కూర్చున్నాంగా కబుర్లు చెప్పుకుంటూ. లేటుగా పడుకోవడం వల్ల తెల్లవారి త్వరగా లేవలేదు", వాళ్లలో వాళ్లు సమాధానపడి వాళ్ల వాళ్ల కాలకృత్యాలు ముగించారు.

ప్రకాశం ఇంకా నిద్ర లేవలేదు.

వృద్ధ మిత్రులంతా ఖంగారుగా తట్టి, కుదిపి ఎంత లేపినా ప్రకాశంలో చలనం లేదు. తలగడ ప్రక్కనే ఓ కాగితం రెపరెపలాడింది.

ఆతృతగా విప్పి చదివారు.

"మీరంతా మీ మీ గదులకు వెళ్లాక నా రూములో నా మిత్రులు పడుకున్నాక నేనో నిర్ణయానికి వచ్చాను. అప్పు తీసుకున్న వాళ్లంతా నా ఆప్తులే. తిరిగి ఇవ్వడంలోనే జాప్యం, మొహం చాటేయటం, మొండి చెయ్యి చూపించడం జరిగింది. నా మంచితనం నా నైజం. దాన్ని ఎవరు మాన్పించగలరు. కాదనగలరు. ఈ అప్పుల చిట్టా పుచ్చుకుని సిటీకి వెళ్లి వాళ్లచుట్టూ తిరిగి తిరిగి అలిసిపోయాను. నా వాళ్లే నన్ను దద్దమ్మలా జమకట్టి ఒంటరివాడిని చేసేశారు. నేనెవరికోసం బ్రతకాలి. దేనికి బ్రతకాలి. బ్రతికి వుంటే అప్పులిస్తూండటం వాటిని రాబట్టుకోవటం కోసం వాళ్లచుట్టూ తిరగటం. ఎందుకీ ప్రయాస. నా పిల్లల పెళ్లికి ఓ లక్ష ఇచ్చాను. నిత్యకృత్యానికై ఇరవైవేలు ఇచ్చాను. నా బాధ్యతలు తీరాయి. నా కంటూ మిగిలిన ఇంకో అరలక్ష బ్యాంకులో వుంది అది ఆశ్రమానికే చెందాలని విల్లు రాశాను. అది అల్మారాలో వుంది. నా మంచి మనసే నా జీవితాన్ని చిందరవందర చేసింది. నా మనసుకు నేనే మరణశిక్ష విధించుకున్నాను,"

తలగడకు అవతల ప్రక్క ఖాళీ నిద్ర మాత్రల సీసా పడి వుంది.

మంచి మనిషి మంచి మనసు అనంతవాయువుల్లో కలిసిపోయింది.

●